క్లుప్తంగా

బోధనలో మెళకువలు పాటించాలి



ఉదయగిరి: పాఠశాల క్లస్టర్ సమావేశాలకు ఉపాధ్యాయులు హాజరై బోధనలో మెళకువలు, బోధనా పద్ధతులు, నైపుణ్యాలను తెలుసుకుని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఎంఈఓ-2 టీ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం దళితవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అతిథి భోజనంలో భాగంగా విశ్రాంత హెచ్ఎం సయ్యద్‌ఖలీం అందజేసిన పండ్లు, స్వీట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు బాలకేశవులు, షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాచవారిపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి



ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

దుత్తలూరు: రాచవారిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ సంస్థ వ్యవస్థాపకుడు రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి పేర్కొన్నారు. సీడ్స్ సంస్థ తరపున రాచవారిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడ్స్ సంస్థ తరపున రాచవారిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి ఇంకా అవసరమైన సాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరి రోశిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరటంపాడు ఎంపీటీసీ మృతి



ఖాసింసా(ఫైల్)

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు ఎంపీటీసీ సభ్యుడు ఖాసింసా అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, కరటంపాడు, బోయచిరువెళ్ల సర్పంచ్‌లు పూనుగుంట రేవతి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, నాయకులు పెమ్మసాని శ్రీనివాసులనాయుడు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఖాసింసా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి అందించిన సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు.

17న అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



సీడీపీఓ సునీతకు ధర్నా నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉదయగిరి: అంగన్‌వాడీ కార్యకర్తల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈ నెల 17న ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు సీఐటీయూ నాయకులు జీ నాగేశ్వరరావు, ప్రమీల, రజియా తెలిపారు. శనివారం వారు ధర్నా నోటీసును సీడీపీఓ ఎస్ సునీతకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలను పెంచాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని, మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ ఇవ్వాలని, తదితర డిమాండ్లతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

సోమశిల: అనంతసాగరంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. తహసీల్దార్ సుభాషిణి ముఖ్యఅతిథిగా హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధరను పొందాలని కోరారు. సహకార సంఘం సీఈఓ భక్తవత్సలబాబు, రైతులు పాల్గొన్నారు.

పంచతంత్ర.. చదువు మంత్ర

కేజీబీవీల్లో ప్రత్యేక ప్రణాళిక అమలు

- ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం
- స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షలు



ప్రత్యేక తరగతుల్లో కేజీబీవీ విద్యార్థినులు

దుత్తలూరు: విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించాలన్నా.. ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నా పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కులే కీలకం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో విద్యాశాఖ అధికారులు 'పంచతంత్ర' పేరుతో ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక స్టడీ క్లాసులతో పాటు వారాంతపు పరీక్షలను నిర్వహిస్తున్నారు. మధ్య మధ్యలో గ్రాండ్ టెస్టులు పెడుతున్నారు. దీంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించి బోధన చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో దుత్తలూరు, సీతారామపురం, కొండాపురం, కలిగిరి మండలాలలో కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో పదో తరగతిలో 147 మంది, ఇంటర్‌లో 212 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరందరి కోసం సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారులు ప్రత్యేకంగా పంచతంత్ర ప్రణాళికను అమలు చేస్తున్నారు. కేజీబీవీల్లో పనిచేసే ప్రిన్సిపల్‌తో పాటు సీఆర్‌టీలు, పీజీటీలు కొందరు విద్యార్థినులను దత్తత తీసుకుని చదివిస్తున్నారు. ఆయా విద్యార్థినిలు ఎలా చదువుతున్నారు..ఏ ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు తదితర అంశాలను పరిశీలిస్తూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ మొత్తం కార్యాచరణ అమలును కేజీబీవీల జిల్లా జీసీడీఓ పర్యవేక్షిస్తున్నారు.

వందరోజుల ప్రణాళిక

కేజీబీవీలో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ రాష్ట్ర ఉన్నతాధికారులు పంచతంత్ర పేరుతో వందరోజుల ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళికను ఇప్పటికే అమలు చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 6:30 గంటల నుంచి పాఠ్యాంశాల పునఃశ్చరణ మొదలవుతుంది. రాత్రి 10 గంటల వరకు ఆయా సబ్జెక్టులపై పరీక్షలు, స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ఎస్‌సీఈఆర్టీ మోడల్ ప్రశ్నాపత్రాలను కేజీబీవీలకు అందించి సాధన చేయిస్తున్నారు.



ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు



పదో తరగతి పరీక్షల కోసం బాగా చదువుతున్నాం. ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయినులు ప్రత్యేక శ్రద్ధ వహించి చదివిస్తున్నారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తాం.

– రాజేశ్వరి, హరిత, పదో తరగతి విద్యార్థినులు, నందిపాడు

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు



పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సందేహాలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. రోజు, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తూ పరీక్షలపై భయాన్ని పోగొడుతున్నారు.

-ఎస్ అనీషా, పదో తరగతి, కొండాపురం

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

కేజీబీవీలో పంచతంత్రను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నాం. పదో తరగతిలో నూరుశాతం ఫలితాల సాధనకు విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం.

– అంజనీదేవి, ప్రిన్సిపల్, నందిపాడు కేజీబీవీ

ప్రశాంతంగా ప్రాక్టికల్ పరీక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌తో పాటు ఒకేషనల్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడ్రోజుల పాటు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వాణీశ్రీ తెలిపారు. కాగా తొలిరోజు ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు ఇంటర్ విద్యార్థులు 21 మంది హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 134 మంది హాజరుకాగా, 16 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 123 మందికిగానూ 111 మంది హాజరైనట్లు, 12 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ వివరించారు.

నేడు పుస్తకావిష్కరణ

కావలి :విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన 'భారత స్వాతంత్ర ఉద్యమం-ఆంధ్ర ముస్లిం యోధులు' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాగునీటి కాలువలో పడిన జింక

- సురక్షితంగా కాపాడిన యువకులు

ఉదయగిరి: వెంగళరావునగర్ సమీపంలోని గండిపాళెం ప్రాజెక్టు సాగునీటి కాలువలో శనివారం ప్రమాదవశాత్తు ఓ జింక పడింది. తాగునీటి కోసం అటవీ ప్రాంతం నుంచి గ్రామ సమీపానికి వచ్చిన జింకను కుక్కలు తరమడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయింది. దాన్ని గమనించిన స్థానిక యువకులు నీటిలో నుంచి రక్షించి అడవిలో వదిలేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



విశేషాలంకారంలో సీతారామలక్ష్మణులు



విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి అనిల్‌కుమార్, జెడ్పీటీసీ రాపూరు

సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం పంచాయతీ పరిధిలోని అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా మూడోరోజైన శనివారం సీతారామలక్ష్మణఆంజనేయస్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మాజీ మంత్రి పీ అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండల జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ అక్కలరెడ్డి కొండారెడ్డి, నాయకులు అక్కలరెడ్డి అంకిరెడ్డి, మధు, ఆలయ ధర్మకర్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



నందిపాడులో మాట్లాడుతున్న ఎంఈఓ వెంగయ్య

దుత్తలూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ ఎస్ వెంగయ్య సూచించారు. శనివారం దుత్తలూరు, నందిపాడు ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్‌జీటీలు, సబ్జెక్టు టీచర్లు విడివిడిగా బోధనాంశాలపై చర్చించారు. ఫౌండేషన్, లిటరసీ, న్యూమరికల్, టీచ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమాలపై చర్చించి విద్యాబోధనకు అవసరమైన టీఎల్ఎంను తయారుచేసుకోవాలని సూచించారు. సమావేశాల్లో చర్చించిన అంశాలను తరగతి గదుల్లో అమలు చేసి వచ్చే సమావేశాలకు అవి ఎంతమేర ఫలితాలు సాధించాయో నివేదిక తయారు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పీ రవికుమార్, నాగలక్ష్మి, సుబ్బారెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక రోగుల ఇక్కట్లు



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎదుట బస్‌షెల్టర్ లేక రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆస్పత్రి ప్రహరీ కింద నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపీ నిధులతో బస్‌షెల్టర్‌ను నిర్మించారు. కానీ రోడ్డుకు అవతలివైపు న బస్‌షెల్టర్ లేకపోవడంతో రోగులు ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరతుమ్మ చెట్ల కింద సేదతీరాల్సిన పరిస్థితి నెలకొంది.

104 వాహన సేవలు

వరికుంటపాడు: తూర్పుచెన్నంపల్లెలో 104 వాహన సేవలను శుక్రవారం అందజేశారు. వైద్యాధికారిణి కరీష్మా రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

నేటి నుంచి ప్రథమ వార్షిక వేడుకలు

వరికుంటపాడు: స్థానిక వైకుంఠపురంలో ఉన్న పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రథమ వార్షిక వేడుకలను ఆదివారం నుండి బుధవారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు పెంద్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 17, 18 తేదీల్లో విశేష పూజలు, హోమాలు, వివిధ వాహన సేవలు ఉంటాయని తెలిపారు. 19న కలశ ఆరాధన, సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, శ్రీవారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఆశీర్వచనం



కలిగిరి: స్థానిక ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో శనివారం జరిగిన తెల్లపాడు ఎంపీటీసీ మార్లెళ్ల ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు జోత్స్నరెడ్డి-యుగంధర్‌రెడ్డిని ఆశీర్వదించారు.కలిగిరి, వింజమూరు జెడ్పీటీసీలు పాలూరు మాల్యాద్రిరెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ధర్నా నిర్వహిస్తున్న దళితులు

కావలి : తమిళనాడులో అగ్రవర్ణాల ఇంటి ముందు బుల్లెట్‌ను నడిపాడని దళిత యువకుడి చేతులు నరకడం దారుణమని, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో దళితులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న అయ్యప్ప అనే యువకుడు అగ్రవర్ణాల ఇళ్ల ముందు బుల్లెట్ నడిపాడని అతని చేతులను నరికారని తెలిపారు. ఈ దారుణమైన ఘటనపై తమిళనాడు ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం కూడా అగ్రవర్ణాల వారిని మందలించలేదని తెలిపారు. బీజేపీ అధ్యక్షుడు ఏరుమల్లె కూడా ఆ ఇంటివంక కన్నెత్తి చూడలేదన్నారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు పెట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘాజియబాద్ జిల్లాలో దళిత యువతిని అత్యంత క్రూరంగా చంపినా నిందితులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని గుర్తుచేశారు. చౌటూరి వెంకటరత్నం, చలంచర్ల లక్ష్మయ్య, నరసింహులు, పరుసు నరసింహం, విద్యార్థి నాయకులు మధు, పీ శ్రీనివాసులు, జెడ్డా వాసు పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న మమత

అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బాలిక, శిశు అభివృద్ధి అధికారిణి టీ మమత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్ రూము, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచతంత్ర కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలని ఉపాధ్యాయినులకు సూచించారు. విద్యార్థుల భద్రతా విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మమ్మ, అకౌంటెంట్ సరోజ, తదితరులు ఉన్నారు.

చిత్తలూరుకు ఉత్తమ పంచాయతీ అవార్డు



చేజర్ల: మండలంలోని చిత్తలూరుకు ఉత్తమ పంచాయతీ అవార్డు లభించింది. కందుకూరులోని మార్కెటింగ్ యార్డులో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సర్పంచ్ విజయమ్మకు అవార్డును అందజేశారు. ఓడీఎఫ్ గ్రామంగా గుర్తించి అవార్డును అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

సీతారామపురం: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆదర్శ పాఠశాల నిర్వహణపై ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

గోదాము పరిశీలన



సంగం: మండలంలోని తరువాయిలోని సహకార శాఖ గోదామును డీసీఓ గుర్రప్ప శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని గోదాములో నిల్వ చేసుకుని ధరలు వచ్చినప్పుడు విక్రయించుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఈఓ దస్తగిరి ఉన్నారు.

ఉపాధి నిధులతో పారిశుధ్య కార్యక్రమాలు



రావులుకొల్లులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

ఆత్మకూరురూరల్: ఉపాధి నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీకంపోస్ట్ తయారీతో పాటు ఇతర పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని 21 పంచాయతీలకుగానూ 17 పంచాయతీల్లో తడి, పొడి చెత్తను సేకరించడంతో పాటు సంపద తయారీ కేంద్రాలకు తరలించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. నాగులపాడు, చెర్లోయడవల్లి, రావులకొల్లు గ్రామాల్లో ఎంపీడీఓ, నువ్వూరుపాడు, దేపూరు గ్రామాల్లో ఈఓఆర్డీ డేవిడ్ పర్యవేక్షించారు.

సంపద కేంద్రంలో వానపాముల విడుదల



సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ భాస్కర్ శనివారం పరిశీలించారు. వర్మికంపోస్టు తయారీ తొట్లలో వానపాములు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈఓపీఆర్డీ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎంఆర్‌సీ ఖలీల్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



కలిగిరిలో వానపాములు వదులుతున్న ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి



వరికుంటపాడు: చెత్త బుట్టలు అందజేస్తున్న ఎంపీడీఓ



ఆత్మకూరు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే వ్యాధులు దరిచేరవని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషాసుందరి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైద్యసిబ్బంది ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేసి మొక్కలను నాటారు.

వరికుంటపాడు: మండలంలోని తూర్పుచెన్నంపల్లిలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తను వీధుల్లో పడేయకుండా పంచాయతీ కార్మికులకు అందజేయాలని సూచించారు. అనంతరం చెత్త బుట్టలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, ఏపీఓ అజాంఖాన్, ఎంఆర్‌సీ డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: దుత్తలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం దుత్తలూరు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ మల్లికార్జున, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం, తలుపూరుపాడు గ్రామాల్లో సర్పంచ్‌లు ఆనం ప్రసాద్‌రెడ్డి, నాజరున్నీసా ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సంగంలో ఎంపీడీఓ షాలెట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని శుభ్రం చేశారు. సంగం సాగునీటి సంఘ అధ్యక్షుడు షేక్ బాబు, ఈఓపీఆర్డీ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కలిగిరి: కలిగిరిలో ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం సంపద తయారీ కేంద్రం వర్మికంపోస్టు తయారీకి వానపాములను వదిలి మొక్కలను నాటారు. సర్పంచ్ రాగి దివ్య, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక అటవీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అటవీ కార్యాలయ ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు. ఉదయగిరి రేంజ్ అధికారి కుమార్‌రాజా, సిబ్బంది పాల్గొన్నారు.



దుత్తలూరు సెంటర్‌లో..

అల్లూరు: మండలంలోని పురిణిలో పంచాయతీ కార్యదర్శి మాధవ్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీని నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని ఆదురుపల్లిలోని అటవీశాఖ కేంద్రం పరిసరాలను అటవీశాఖ సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ షేక్ ఖాజారసూల్, సిబ్బంది పాల్గొన్నారు.